


ఆరోజు నందివాహనం ఊరేగింపు.

స్వామి విగ్రహాన్ని వాహనం మీద వేంచేపు చేశారు. అర్చకులు హారతి ఇచ్చారు. స్థానాచార్లు "వాయించండోయ్! భజంత్రీలు!" అన్నాడు. కాని వాద్యగాళ్ళు వాయించరే! పండగరోజులు కాబట్టి జోడు సన్నాయి వాద్యగాళ్ళు వచ్చారు. అందులో ఒక్కడూ వాయించలేదు. "ఓరి మీ దుంపతెగ! మీకేమొచ్చిందిరా వాయించండ్రా" అని ఎవరో అరిచారు. వాళ్ళు విన్పించుకోలా. పానకాలు, పరమేశు సన్నాయి కర్రలు పక్కన పెట్టి వాదించుకుంటున్నారు. సంగీతాన్ని గురించి పెద్దగా కేకలేసుకుంటున్నారు.

"ఏందోయ్! నువ్వాయించేది?" అన్నాడు పానకాలు.

"నువ్వేందోయ్! వాయించేది?" అన్నాడు పరమేశు.

"నీకు సన్నాయి కర్రకి బొక్కలెన్నో తెలుసా?"

"నీకు పీక నోట్లో పెట్టుకోవటం తెలుసంట్రా?"

"అరేయ్! నువ్వూ నీ గురువూ నా కాలికింద నుంచి దూరిపోవాల్రా!

"షంషేర్" తొడ చరిచాడు పానకాలు.

"నా గురువు నంటావురా నాయాల" తిరగబడ్డాడు పరమేశు.

ఇద్దరూ కలేబడ్డారు, సన్నాయి కర్రల్తో మోదుకున్నారు. గుద్దుకున్నారు. కిందపడి కుమ్ముకున్నారు. రొప్పుకుంటూ రోజుకుంటూ కసిగా తన్నుకున్నారు. జనం విడదీశారు ఇద్దర్నీ. చెరోవైపు పట్టుకున్నారు. నెత్తురోడుతున్నా ఢీకొనటానికి సిద్ధంగా ఉన్న పొట్టేళ్ళలా ఉరిమి ఉరిమి చూసుకుంటున్నారు పానకాలు, పరమేశు. స్థానాచార్లు మధ్యకొచ్చి "మీరు పడిచావ! ఊరేగింపు బయలుదేరాలి. వాయించండ్రా!" అన్నాడు.

"ఉండండి. వాడు వాయించేది వాడు గురువు దగ్గర నేర్చుకొన్నాడంట! నేన్నేర్చుకోలేదంట. ఎవడు వాయించినా ఆ ఏడచ్చురాలే కదండి!" అన్నాడు పానకాలు.

పరమేశు వూగిపోతూ "ఏడచ్చురాలు కాదురా! మూడచ్చురాలు వాయించు చూస్తాను" అన్నాడు.

"ఏడో మూడో ఏదో వాయించేడవండ్రా!" అని అరిచాడు వాహనం దగ్గరున్న అర్చకుడు.

ఎట్టకేలకు పానకాలు, పరమేశు సన్నాయి కర్రలు చేత పట్టారండి. ఇహ చూడండి వాళ్ళు వాయించారు! పానకాలు "తనక తనకం తత్తనక తనకం" అని వీరంగం వాయిస్తే పరమేశు నైవేద్యాలు జరిగేటప్పుడు వాయించే వరస వాయించాడు. ఉన్న ఒకే ఒక డోలు వాద్యగాడు ఎవరికి వాయించాలో తెలియక కుడి పానకాలకి ఎడమ పరమేశుకు బాదటం మొదలెట్టాడు. తాళంవాడు వాడిష్టం వచ్చినట్టు ఇంకెవడికో తాళం వేస్తున్నాడు. మీ వాద్యాల సంగతి నాకనవసరం అని శంభులింగం బయ్‌మని శంఖం పూరించాడు. ఈ ధ్వనులన్నింటినీ ముంచేట్టుగా దూదేకుల సాయెబు "ఖయ్ ఖయ్" మని బాకా వూదాడు. ఇలా పరమ బీభత్సమైన వాద్య ఘోషతో వూరేగింపు బయలుదేరింది.

ఈ వాద్యఘోష కోటలో ఉన్న పెద్దొరగారి చెవిన పడింది. దొరగారు గుమాస్తాని

పిలిచి "రుంజలూ. కొమ్ముబూరాలు, తప్పెట్లు విన్పిస్తున్నాయి. ముత్యాలమ్మ జాతర జరుగుతోందా?" అనడిగారు.

గుమస్తా గతుక్కుమని సమాధానం చెప్పకపోతే దొరగారు కళ్ళెత్తి చూశారు. అంటే 'సమాధానం చెప్పరేం?' అని. అప్పుడు గుమాస్తా "అయ్యా! అది మన గుళ్ళో మేళవేఁనండి" అన్నాడు. దొరగారి ముఖం గంభీరమైంది. ముఖం పక్కకి తిప్పుకుని ఆలోచనలు పురమాయింపులవైపు సాగించారు.

మూడడగుల చదరం పీటలు రెండొందలు, వంద వర్ధన పళ్ళాలు, యాభై గంటెలు, నలభై గంగాళాలు, ముప్పయి పట్టెమంచాలు, వాటి మీదికి అరవై పరుపులు, నూరు బాలీసులు తన జమిందారీ బంధువర్గమంతా ఒకనాడు అమరావతి వస్తారని, అప్పుడు అవసరమైన సామాగ్రికి వెతుక్కోనక్కరలేకుండా సర్వ సంబారాలు తయారుచేయించి ఆరు గదులనిండా పేర్పించిన తర్వాత తమ పూర్వుల చిత్ర పటాలన్నీ మూడేసి కాపీలు తీయించి మరో గదిలో నింపి కోటలోనే మిషను పెట్టి పాతిక సిల్కు లాల్చీలు కుడ్తున్న దర్జీ సంజీవరావుని చూస్తున్న దొర గారికి ఆ మిషనుమోత మరీ మరీ వింటుంటే ఇందాక విన్పించిన గందరగోళం మళ్ళీ జ్ఞాపకం వచ్చింది.

"ఇందాక మన గుళ్లో మేళవే అన్నారు?" అని అడిగాడు దొరగారు గుమాస్తాని. అంటే దాని వివరం చెప్పమని. అప్పుడు గుమాస్తా "అయ్యా తమ పూర్వీకులు అందరికీ మాన్యాలిచ్చారు గదా! సన్నాయి వాయించేవాళ్ళకి పన్నెండెకరాలు, డోలుకి పన్నెండెకరాలు, శంఖానికి పన్నెండెకరాలు, తాళానికి పన్నెండెకరాలు, బాకాకి పన్నెండెకరాలు ఇలా వచ్చిన భూముల్ని వాళ్ళంతా అనుభవిస్తూ కూర్చున్నారేగాని సంగీతం నేర్చుకోలేదండయ్యా!"

'అన్నన్నా!' అనుకున్నారో ఏమో తెలియదు. పెద్దొరగారు నాల్గు రోజులు తర్వాత సన్నాయి వాద్యగాళ్ళ కుటుంబంలోంచి 'వీరాస్వామి' అనేవాణ్ణి ఎన్నిక చేసి తంజావూరు పంపించారు 'సంగీతం నేర్చుకో' అని. అలా ఐదు సంవత్సరాల పాటు వీరాస్వామి సంగీత విద్యకోసం పదివేల రూపాయలు ఖర్చుపెట్టారు.

శివరాత్రి వచ్చింది. తంజావూరు నుంచి వీరాస్వామి తిరిగొచ్చాడు. పెద్దొరగారు గుమాస్తాని పిలిచి "రథోత్సవానికి ముందు వీరాస్వామి చేత కచేరీ పెట్టించండి" అన్నారు. శివరాత్రి జనం కిక్కిరిసి ఉన్నారు. రథం ముందు వీరాస్వామి సన్నాయి కచేరీకోసం రంగం సిద్ధం చేయబడివుంది. మామూలుగా అయితే ఒక్కసారి వచ్చి నమస్కారం పెట్టి వెళ్ళిపోయే పెద్దొరగారు ఆ రోజు కోట గుమ్మంలో కుర్చీ వేయించుక్కూర్చున్నారు వీరాస్వామి కచేరి వినటానికి.

వీరాస్వామి తోడుగా ఇంకో సన్నాయి వాద్యగాణ్ణి తెచ్చుకున్నాడు. కచేరీ మొదలయింది. పక్క సన్నాయి వాడు అందుకున్నాడు. వీరాస్వామి సన్నాయి పీక నోట్లో పెట్టుకుని 'పీ!పీ!' అంటున్నాడు.

దొరగారు "మన వీరాస్వామి వాయించడేం?" అన్నారు.

గుమాస్తా మాట్లాడలేదు.

వీరాస్వామి పీక నోట్లో పెట్టుకొని "పీ!పీ!" అంటున్నాడు. పక్కవాడు ఆలాపన పూర్తిచేశాడు.

వీరస్వామి "పీ! పీ"అంటున్నాడు. పక్కవాడు కీర్తన అందుకున్నాడు.

వీరాస్వామి "పీ! పీ!". పక్కవాడు స్వరం వేస్తున్నాడు.

వీరస్వామి "పీ! పీ!". "మన వీరాస్వామి వాయించడేం," అన్నారు దొరగారు.

పక్కవాడు కీర్తన పూర్తిచేసి రెండో కీర్తన అందుకున్నాడు.

వీరాస్వామి "పీ! పీ!"

పక్కవాడు మూడో కీర్తనందుకుంటే, వీరాస్వామి ఇంకా "పీ! పీ!" అని సన్నాయి పీక సవరిస్తుంటే దొరగారు మళ్ళీ అడిగారు "తంజావూరులో ఐదేళ్ళు నేర్చుకొచ్చాడు. మన వీరాస్వామి వాయించడే!"

అప్పుడు గుమాస్తా చెప్పాడు "అయ్యా! ఈ ఐదేళ్ళు పదివేల ఖర్చుతో వీరాస్వామి 'పీ! పీ!' వరకే నేర్చుకున్నాడండి."

దొరగారు కుర్చీలోంచి చెంగున లేచి కోటలోకి వెళ్ళిపోయారు.*